క్లుప్తంగా

బడ్జెట్‌కు ఆమోదం

చొప్పదండి: చొప్పదండి పురపాలక సంఘం వార్షిక సాధారణ బడ్జెట్‌ను ఆమోదించినట్లు మున్సిపల్ కమిషనర్ నాగరాజు తెలిపారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో రూ.4 కోట్ల ఆదాయం అంచనా వేశామన్నారు. అదేవిధంగా వ్యయం రూ.3.99 కోట్లు అంచనా వేశామన్నారు. ప్రభుత్వ గ్రాంట్లు, డిపాజిట్ల రూపంలో మొత్తం బడ్జెట్ అంచనా రూ.పదిహేను కోట్లకు అంచనా వేశామన్నారు. మున్సిపల్ ప్రత్యేకాధికారి, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయి సమక్షంలో అంచనా బడ్జెట్ రూపొందించామని వివరించారు.

రైతులు అధైర్యపడొద్దు

వీణవంక: ఎస్సారెస్పీ ఎస్కేప్ ద్వారా నీటిని దిగువనకు వదలామని, రైతులు అధైర్యపడొద్దని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్‌రెడ్డి అన్నారు. ఎస్సారెస్పీ కెనాల్ ఎస్కేప్ 19 రోజులుగా పాడైపోయిందని, విషయాన్ని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇంచార్జి వొడితెల ప్రణవ్‌కు వివరించడంతో వెంటనే సొంతంగా మరమ్మతు చేసి దిగువకు నీటిని విడుదల చేయించారని తెలపారు. ఎస్కేప్ ఎత్తడం ద్వారా కల్వల చెరువు నిండి వీణవంక, రామకృష్ణాపూర్, లస్మక్కపల్లి చెక్‌డ్యామ్‌లకు చేరుతోందని రైతులు తాగు, సాగు నీటిని వినియోగించుకోవాలన్నారు. ఎస్కేప్ మరమ్మతుకు కృషి చేసిన ప్రణవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గెల్లు శ్రీనివాస్ యాదవ్, తదితరులున్నారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి



మాట్లాడుతున్న కొప్పుల శంకర్, తదితరులు

హుజూరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ సమీపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే కార్మికుల వేతనాల కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని,న్యాయపరంగా రావాల్సిన హక్కులను ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనలు చేపడుతామన్నారు. సమావేశంలో నాయకులు కొమురయ్య,ఆకునూరి సుధాకర్,మొగిలి, అవినాష్, తదితరులు పాల్గొన్నారు.

ఆక్సిజన్ కాన్సెంట్రేటర్ అందజేత

వీణవంక: మండలంలోని వల్భాపూర్ గ్రామానికి చెందిన నామని రాజయ్య అనే రైతు అనారోగ్యానికి గురికాగా ఆలయ ఫౌండేషన్ సభ్యులు పరామర్శించి ఆక్సిజన్ కాన్సెంట్రేటర్ అందించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాజయ్యకు కాన్సెంట్రేటర్ కావాలని వైద్యులు సూచించడంతో ఫౌండేషన్ మార్గదర్శకుడు పరికిపండ్ల నరహరి(ఐఏఎస్)దృష్టికి విషయం తీసుకెళ్లారు. వెంటనే ఫౌండేషన్ ద్వారా ఆక్సిజన్ కాన్సెంట్రేటర్ అందించినట్లు కోఆర్డినేటర్ గుణసాగర్ తెలిపారు. నరహరికి రాజయ్య కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఎనిమిదేళ్లుగా ఫౌండేషన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్న నరహరి మధ్యప్రదేశ్‌లో ఐఏఎస్ అధికారిగా పని చేస్తున్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

సైదాపూర్: తెలంగాణ అమరుల ఆశయాలను తుంగలో తొక్కి అబద్ధాల పునాదులపై అధికారం చెలాయించిన కేసీఆర్ వంటి నాయకుడు ప్రపంచంలో లేడని డీసీసీ అధికార ప్రతినిధి మ్యాకల రవీందర్ ఆరోపించారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకర్లతో మాట్లాడారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అధ్వానంగా మాట్లాడారని, ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కేటీఆర్ నోరుతెరిస్తే అబద్ధాలే మాట్లాడుతున్నారని, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పని చేస్తోందని, బీఆర్ఎస్ నాయకుల మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని అన్నారు.

బీఆర్ఎస్ పాలనలో మహిళలకు కనీస గౌరవం దక్కలేదు

సైదాపూర్: మహిళల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వ పాలన సాగుతోందని పార్టీ సైదాపూర్ మండల మహిళా అధ్యక్షురాలు చాడ చైతన్యారెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో మహిళలకు కనీస గౌరవం దక్కలేదని సీఎం రేవంత్‌రెడ్డి మహిళల కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం. 200 యూనిట్ల ఉచిత కరెంటు, రూ.500 గ్యాస్ సబ్సిడీ అందిస్తున్నారని, మహిళా సంఘాలకు బస్సులు మంజూరు చేసి ఆర్టీసీకి అద్దెకు ఇవ్వడంతో ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అభయహస్తం డబ్బులు స్వాహా చేసిందని, పదేళ్ల పాలనలో కేసీఆర్ కూతురు కవితకు మాత్రమే విలువ ఉండేదన్నారు.

రైతుల హైరానా

- అడవిజంతువుల బారినపడుతున్న లేగదూడలు
- అడ్డాగా సుందరగిరి గ్రామంలోని శ్రీవేంకటేశ్వరస్వామి గుట్ట
- బెంబేలెత్తున్న పాడిరైతులు
- మూడేళ్లలో వందకుపైగా లేగదూడలు హతం, 24 మందికే పరిహారం



సుందరగిరిలో హైనాదాడిలో మృతి చెందిన లేగదూడను పరిశీలిస్తున్న ఫారెస్ట్ సెక్షన్ అధికారి

చిగురుమామిడి: మండలంలోని ఆయా గ్రామాల్లో లేగదూడలపై హైనా(మృగం) దాడులు రోజురోజుకు ఎక్కువైపోతున్నాయి. దీంతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు. ఎవరికి కనబడకుండా, చిక్కకుండా, దొరక్కుండా సంచరిస్తున్నాయి. రైతులు పశువులను పాకల్లో కట్టేసి ఇళ్లకు చేరుకోగానే అదును చూసి దాడులకు పాల్పడుతున్నాయి. దీంతో తీవ్ర రక్తస్రావమై మృత్యువాతపడుతున్నాయి. లేగదూడలల్లో కావాల్సిన అవయవాలను తినేసి వెళ్తున్నాయి. మూడేళ్లలో పశుసంవర్ధక, అటవీశాఖాధికారుల లెక్కప్రకారం దాదాపు 130 లేగదూడలు మృతిచెందాయి. సుందరగిరి శ్రీవేంకటేశ్వరస్వామి గుట్ట హైనాలకు అడ్డాగా మారింది. పెద్దపశువులను వదిలేసి లేగదూడలను టార్గెట్ చేస్తున్నాయి. వన్యప్రాణులను కట్టడి చేసేవారు కరువయ్యారని రైతులు ఆందోలన చెందుతున్నారు. లేగదూడల మృతితో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. హైనా దాడిలో చనిపోయిన లేగదూడను పశుసంవర్ధక శాఖ అధికారులతో కలిసి అటవీశాఖాధికారులు పంచనామా చేసి పరిహారం నిర్ణయించి ఆర్థిక సాయం అందిస్తున్నారు. ఇప్పటివరకు 24 మంది బాధిత రైతులకు జిల్లా అటవీశాఖాధికారి కార్యాలయం నుంచి రూ. 2.17 లక్షల పరిహారం అందింది. మిగతా పాడి రైతులకు పరిహారం అందాల్సి ఉంది. మరోవైపు పరిహారం తక్కువ అందుతుందని కనీసం రూ.ముప్పైవేల నుంచి నలభైవేలు అందించాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

అటవీశాఖ అధికారులు సహకరించాలి

సుందరగిరి శ్రీవేంకటేశ్వరస్వామి గుట్ట ఆవాసంగా రాత్రివేళ దాడులు జరుగుతుంటే అటవీశాఖ అధికారులు కట్టడి చేయలేకపోతున్నారు. పశువుల పాక వద్ద లేగదూడల సంరక్షణకు కంచె ఏర్పాటుకు ఆర్థికసాయం అందించాలని, జిల్లా అటవీశాఖ ఉన్నతాధికారులు విషయం పరిగణనలోకి తీసుకోవాలని గ్రామాల రైతులు కోరుతున్నారు.

పరిహారం రైతుల ఖాతాల్లో..

హైనా దాడిలో లేగదూడలు మృతిచెందుతున్న మాట వాస్తవమే. రైతులు ఇచ్చిన సమాచారం పరిశీలిస్తున్నాం. మండల పశువైద్యాధికారి ధృవీకరణ పత్రాలతో పరిహారం కోసం సిఫారసు చేస్తున్నం. పశువైద్యాధికారి ధృవీకరించిన ప్రకారమే పరిహారం రైతుల ఖాతాల్లో వేస్తున్నం.

– శేఖర్ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్, చిగురుమామిడి

మూడేళ్లలో వందకుపైగా..

మూడేళ్లలో దాదాపు వందకుపైగా లేగదూడలు హైనాదాడిలో మృతి చెందాయి. బాధిత రైతుల ఫిర్యాదు మేరకు మృతిచెందిన లేగదూడ విలువను ధృవీకరించి అటవీశాఖ అధికారులకు పంపిస్తున్నాం. ఎంత ఇవ్వాలో వారి నిర్ణయం ప్రకారమే రైతులకు పరిహారం అందుతుంది.

– సాంబశివరావు, పశువైద్యాధికారి, చిగురుమామిడి



జమ్మికుంట: మున్సిపల్ పరిధి 30వ వార్డులోని ఐసీఐసీఐ బ్యాంక్ వద్ద డ్రైనేజీలో చెత్తాచెదారం పేరుకుపోవడంతో మురుగునీరు రోడ్డుపైకి వస్తోంది. మున్సిపల్ అధికారులు, పారిశుధ్య సిబ్బంది పట్టించుకోవడలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగు నీటితో దుర్వాసనతోపాటు దోమల వృద్ధి చెందుతున్నాయని. సంబంధిత అధికారులు ఇకనైనా స్పందించి డ్రైనేజీలోని చెత్తాచెదారం తొలిగించి మురుగునీరు రోడ్డు మీదికి రాకుండా చర్యలు చేపట్టాలనీ కాలనీవాసులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
ఎండీ అయాజ్, మున్సిపల్ కమిషనర్, జమ్మికుంట, సెల్ నంబర్: 89787 78080

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

క్రీడాకారులు ఆటల్లో రాణించాలి



క్రీడాకారులతో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, వొడితెల ప్రణవ్, నాయకులు

హుజూరాబాద్: హుజూరాబాద్‌కు పేరు తెచ్చేలా క్రీడాకారులు ఆటల్లో రాణించాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. ఆదివారం ప్రభుత్వ బాలుర పాఠశాల మైదానంలో జిల్లా స్థాయి హాకీ పోటీలను ప్రారంభించారు. క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసంతో పాటుగా పోటీతత్వం పెరుగుతుందని, హుజూరాబాద్‌లో హాకీ క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించిన సందర్భాలను గుర్తు చేశారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు క్రీడలకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చారని, అందులో భాగంగా హుజూరాబాద్‌లో క్రీడా ప్రాంగణం ఏర్పాటుకు రూ. పదికోట్ల నిధులు మంజూరు చేశారన్నారు. ప్రభుత్వం మారటంతో నిధులు ఆగిపోయాయని, ప్రస్తుత ప్రభుత్వానికి క్రీడలపై చిత్తశుద్ధి నిధులు విడుదల చేయాలన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ హుజూ రాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ మాట్లాడుతూ.. క్రీడాకారులు పోటీల్లో గొప్పగా రాణించాలని, క్రీడా రంగానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో కరీంనగర్ మాజీ మేయర్ సర్దార్‌సింగ్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బండ శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు, నాయకులు తదితరులు ఉన్నారు.

నియామకం



మానకొండూర్‌రూరల్: మండలంలోని లింగాపూర్‌లో ఆదివారం మున్నూరు కాపు సంఘం ఎన్నికలు నిర్వహించారు. సభ్యులు కాసర్ల భూమయ్యను గ్రామశాఖ అధ్యక్షుడిగా కాసర్ల భూమయ్య ఎన్నుకున్నారు. మున్నూరుకాపు సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని భూమయ్య తెలిపారు.

నియామకపత్రం అందజేత



నియామకపత్రాలతో మండలాల అధ్యక్షులు

హుజూరాబాద్: పట్టణంలోని మానవ వికాస కేంద్రంలో సాంస్కృతిక సంస్థల కళాకారుల సమాఖ్య ఆయా మండలాల మండల కమిటీ ఎన్నికలు నిర్వహించారు. హుజూరాబాద్ మండల సమాఖ్య అధ్యక్షురాలిగా మిడిదొడ్డి వసుంధర, సైదాపూర్ మండల అధ్యక్షురాలిగా కొండపర్తి స్వరూప, ఎల్కతుర్తి మండల సమాఖ్య మహిళా అధ్యక్షురాలిగా పల్లె భాగ్యశ్రీ, కార్యదర్శిగా కెంసారపు సంధ్య, భీమదేవరపల్లి మండల సమాఖ్య మహిళా అధ్యక్షురాలిగా కూన రేణుక నియామకమయ్యారు. ఈసందర్భంగా సీనియర్ డప్పు కళాకారుడు అందాసి నారాయణ నియామకపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మారెపల్లి శ్రీనివాస్, తునికి వసంత్, అడ్వకేట్ మహమ్మద్ రఫీ తదితరులున్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి



మానకొండూర్: రిలే నిరాహార దీక్షలో నాయకులు

హుజూరాబాద్: రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలు చేసి ఉద్యోగ నియామకాలు చేపట్టాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ అన్నారు. వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరసన దీక్షలో మాట్లాడారు. 30 ఏళ్లుగా ఉద్యమం చేస్తే సుప్రీంకోర్టు వర్గీకరణకు అనుకూలంగా తీర్పు వెలువడితే అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్య దోరణి అవలంబిస్తుందన్నారు. మాదిగలకు అన్యాయం జరగకుండా వెంటనే ఎస్సీ వర్గీకరణ చేపట్టాన్నారు. దీక్షలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు తూర్పాటి రాజు, నాయకులు జీడి రవితేజ, ఎర్రోళ్ల రమేశ్, బత్తుల తిరుపతి, బోనగిరి శివరామకృష్ణ, మహమ్మద్ రఫీ, డాక్టర్ తడికమళ్ల శేఖర్, తునికి వసంత్ తదితరులున్నారు.

మానకొండూర్: ఎస్సీ వర్గీకరణ అమలయ్యే వరకు ఎలాంటి ఉద్యోగ నియామకాలు చేపట్టొద్దని ఎమ్మార్పీఎస్ నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష ఆదివారంతో ఐదో రోజుకు చేరింది. మాదిగలకు రావాల్సిన వాటా ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ మానకొండూర్ మండల ఇన్‌చార్జి పాముల రమణ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎలకపల్లి పోలు, ఎనగందుల శ్రీనివాస్, కొండ్ర శంకర్, జిల్లాల శ్రీనివాస్, జిల్లాల చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్‌కు మరమ్మతు



సాక్షి స్పందన

మానకొండూర్: మండల కేంద్రంలోని మహంకాళి నగర్‌కు సమీపంలో కరీంనగర్ జమ్మికుంట రోడ్డు పక్కన పైపులైన్ లీకేజీతో నీరంతా వృథాగా పోతోందని సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీంతో ఆదివారం కార్యదర్శి రేవంత్‌రెడ్డి మరమ్మతు చర్యలు చేపట్టారు. పైపులైన్‌కు మరమ్మతు చేసి లీకేజీని అరికట్టడంతో స్థానికులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



తిమ్మాపూర్: నుస్తులాపూర్ జిల్లా పరిషత్ పాఠశాల 2007-08 పదో తరగతి విద్యార్థులు



రామడుగు: చదువు చెప్పిన ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

రామడుగు: మండలంలోని గుండి జిల్లా పరిషత్ పాఠశాల 2004–05 పదో తరగతి విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. చాలా ఏళ్ల తర్వాత ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ, యోగ క్షేమాలను తెలుసుకుంటూ చదువుకున్న రోజులనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం చదువు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భగవంతయ్య, ఉపాధ్యాయులు కర్ర వెంకటరాంరెడ్డి, శ్రీధర్, సురేశ్ పలువురు పాల్గొన్నారు.

తిమ్మాపూర్: మండలంలోని నుస్తులాపూర్ జిల్లా పరిషత్ పాఠశాల 2007–08 పదో తరగతి విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ ససమ్మేళనం నిర్వహించారు. చాలా ఏళ్ల తరువాత ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ చదువుకున్న రోజులనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం చదువు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

జగదీశ్‌రెడ్డి, కేటీఆర్ దిష్టిబొమ్మలు దహనం



చొప్పదండిలో దిష్టిబొమ్మలు దహనం చేస్తున్న నాయకులు

సాక్షినెట్‌వర్క్: అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై ఎమ్మెల్యేలు జగదీశ్‌రెడ్డి, కేటీఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల్లో ఆదివారం కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల చిత్రపటాలను దహనం చేశారు. దళిత స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదు అన్నారు. ప్రజలు ఓటుతో బీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పినా మారడం లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివర్గాలకు న్యాయం చేస్తుందన్నారు.

వైభవంగా శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం



రామడుగు: తాళిబొట్టు చూపిస్తున్న అర్చకులు



చిగురుమామిడి: మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట శ్రీవేంకటేశ్వస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారి కల్యాణోత్సవం వేదపండితుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన పూజారి డింగిరి సత్యనారాయణచార్యులు ప్రత్యేక హోమం, ఇతర పూజా కార్యక్రమాలు చేశారు. కార్యక్రమంలో ఆలయాభివృద్ధి కమిటీ చైర్మన్ నార్ల రమేశ్‌తో పాటు భక్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

వీణవంక: మండలంలోని వల్భాపూర్ శ్రీఅభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం సుదర్శన యాగం నిర్వహించారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు నరసింహాచార్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. అదేవిధంగా మామిడాలపల్లి గ్రామంలోని శివాలయం వార్షిక బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్నారు.

కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కామిడి శ్రీనివాస్‌రెడి, మూల పుల్లారెడ్డి, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొండాపూర్‌లో మల్లికార్జునస్వామి జాతర

చిగురుమామిడి: మండలంలోని కొండాపూర్‌లో ఆదివారం స్వయంభూ మల్లికార్జునస్వామి జాతర నిర్వహించారు. గ్రామ యాదవ సంఘం ఆధ్వర్యంలో మహిళలు నెత్తిన బోనాలతో ఆలయానికి చేరుకొని నైవేద్యం సమర్పించారు. ఆలయం వద్ద ఒగ్గు కళాకారులు పట్నం వేసి స్వామివారి చరిత్రను కథా రూపంలో వినిపించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయకమిటీ అధ్యక్షుడు చీకుట్ల రాజుయాదవ్, రవి, పోతరవేణి శ్రీనివాస్, ఐలేశ్, ఓదయ్య, మొగిలి, మల్లేశం, ముత్యాల శ్రీనివాస్,నరేశ్, ఓదెలు, లస్మయ్యతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకోవాలి



మాట్లాడుతున్న పత్తి కృష్ణారెడ్డి, నాయకులు

జమ్మికుంట: కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల జోలికి వస్తే ఊరుకోబోమని, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని పీసీసీ సభ్యుడు పత్తి కృష్ణారెడ్డి హెచ్చరించారు. ఆదివారం పట్టణంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి వెంట ఉండే నాయకులపై అసభ్యంగా మాట్లాడడం సరికాదని, పిచ్చిగా మాట్లాడతే నియోజకవర్గంలో తిరుగనివ్వమని, ప్రజలు కాంగ్రెస్ పార్టీన గెలిపిస్తే తట్టుకోలేకపోతున్నారని, దళితుడిని స్పీకర్‌గా నియమిస్తే హర్షించాల్సింది పోయి ఏకవచనంతో కించపరచడం సరికాదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యులపై వీడియోలు హేయమైన చర్య అని, కుల గణనతో బీసీలకు మేలు చేస్తుంటే అడ్డుకోవద్దన్నారు. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి దిష్టి బొమ్మను పట్టణంలోని గాంధీచౌక్ వద్ద దహనం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ సత్తిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు పర్శరాంరావు, మాజీ కౌన్సిలర్ దిడ్డి రాము, ఇల్లందకుంట మండల మాజీ అధ్యక్షుడు ఇంగిలి రామారావు, మార్కెట్ డైరెక్టర్లు దీక్షిత్ గౌడ్, సూర్య, ముద్దమల్ల రవి,వంగ రామకృష్ణ, కోడెం రజత, తోట స్వప్న, గోడుగు మానస, కోడెం శ్రీను, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కృష్ణారెడ్డి, తదితరులు

చొప్పదండి: గ్రామీణ ప్రాంతాల్లో తక్కువ ధరకు మెడిసిన్స్ అందించేందుకు ఏర్పాటు చేసిన జనరిక్ మందుల షాపును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి కోరారు. మండలంలోని గుమ్లాపూర్‌లో బీజేపీ నాయకులతో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు. చొప్పదండిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో జనరిక్ మందుల దుకాణం ప్రారంభించారని, ఇందులో 75 శాతం వరకు డబ్బు ఆదా చేసుకోవచ్చని తెలిపారు. జనరిక్ ఔషధ యోజన పథకం ప్రారంభానికి కృషి చేసిన పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు వెల్మ మల్లారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు అంజయ్య, బాపురెడ్డి, గంగారెడ్డి, బద్దెనపల్లి రాజేందర్, మండల సాగర్, సామల శ్రీనివాస్, ఆమనగంటి శంకరయ్య, అప్పిడి రాజిరెడ్డి పాల్గొన్నారు.

కేసు నమోదు

జమ్మికుంట: వెనుక నుంచి బైక్‌తో ఢీకొట్టిన ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా ఢీకొట్టిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ రవి ఆదివారం తెలిపారు. హుజూరాబాద్ మండలం ఇందిరానగర్ చెందిన ఎండీ యూసుఫ్‌ఖాన్,భార్య పర్వీన్‌లు బైక్‌పై జమ్మికుంటకు వస్తుండగా హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో మాచనపల్లికి చెందిన కొడాలి గట్టయ్య వేగంగా బైక్‌తో వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో దంపతులకు తీవ్రగాయాలయ్యాయి. బాధితుల కుమారుడు ఆసిఫ్‌ఖాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ వివరించారు.